
# లీకేజీ

దీర్ఘాశి విజయభాస్కర్



**"కమీషనర్ డౌన్, డౌన్... కమీషనర్ డౌన్, డౌన్" అంటూ ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ మహిళలంతా మున్సిపల్ ఆఫీసు చుట్టూ చేరారు. అందర్లోనూ ఎంతో అసహనం కనిపిస్తోంది. రెండురోజుల నుండీ నీళ్ళు రాకపోతే అసహనమే మరి!**

**కమీషనర్ ఏదో మీటింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళి ఆరోజే వచ్చాడు. ఆఫీసుకు రాగానే ఈ గందరగోళం. గుంపులో ఒక పక్కన కౌన్సిలర్ రామాంజనేయులున్నాడు. "గట్టిగా అరవండి! ఇంకా! ఊc! కమీషనర్ మీ వీధిలోకి వచ్చి చూసేవరకూ ఇక్కడి నుండి కదలకండి! కూచోండి! కింద బైఠాయించండి" అని పురిగొల్పి చల్లగా అక్కడినుండి జారుకుని కమీషనర్ ఛాంబర్‌లోకి వచ్చాడు.**

"ఏంటి సార్ ఇది! ఆ ఇంజనీరుకి ఇంత కూడా బాధ్యతలేదు!" కుర్చీ బర్రున ముందుకి లాక్కుని కమీషనర్‌కి ఎదురుగా కూర్చున్నాడు. కమీషనర్‌కి చెమటలు పోస్తున్నాయి. ఆఫీసు చుట్టూ రెండవందల మంది మహిళలు ఖాళీ బిందెలు- నినాదాలు- తిట్లు- శాపనార్థాలు. ఇదంగా చూస్తూ వినోదిస్తున్న జనాలు. కమీషనర్‌కి తల కొట్టేసినట్టయింది. "ఇంజనీరు ఎక్కడయ్యా!" అటెండర్‌ని పిలిచి అడిగాడు.

"ఇంకా రాలేదుసార్." అటెండర్ జవాబిచ్చి బయటనిల్చున్నాడు.

"మీరు ఊర్లో లేకపోతే ఇంజనీరు ఆఫీసుకే రాడు సార్."

రామాంజనేయులు పితూరీ. అవేమీ విన్పించుకునే స్థితిలో లేడు కమీషర్. గభాల్న వాటర్‌వర్క్స్‌కి ఫోన్ చేసి అడిగాడు.

"నిన్న, మొన్న హరిజనవాడకి నీళ్ళు విడవలేదా?"

"విడిచాం సార్"

"ఎంతసేపు?"

"మామూలుగా వదిలేటట్టే సార్"

"అంటే ఎంతసేపు?"

"ముప్పావు గంట"

"ముప్పావుగంట నీళ్ళు వదిల్తే- నీళ్ళు రాకపోవడమేమిటి? అదీ రెండు రోజులు పైగా పబ్లిక్‌హెల్త్‌వారు ఆ ఏరియా అంతా కొత్త పైపులైన్లు వేసారు. కమీషనర్‌కి ఏంచేయాలో పాలుపోలేదు. అటెండర్‌ని పిల్చి ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఎవరున్నారో తీసుకురమ్మన్నాడు. కాస్సేపటికి ఫిట్టరొచ్చాడు.

"ఇంజనీరు ఎక్కడికెళ్ళాడయ్యా?" ఫిట్టర్‌కి కూడా అదే ప్రశ్నవేసాడు.

"ఏమో తెలీదు సార్!"

"సరే. హరిజనవాడకు నీళ్ళెందుకు రావట్లేదు?"

"ఏమో తెలీదు సార్!"

"ఛ! ఏం మనుషులయ్యా మీరు" విసుక్కుంటూ మహిళల దగ్గరకు వచ్చాడు కమీషనర్. అతన్ని చూసి ఇంకా రెచ్చిపోయారు మహిళలు. వాళ్ళను ఓ అరగంటసేపు బతిమాలి, బుజ్జగించి ఎలాగోలా అక్కడినుండి పంపించేసి స్కూటర్ తీసుకుని హరిజనవాడకు బయల్దేరాడు కమీషనర్.

** ** **

ఒక మున్సిపల్ కాంట్రాక్టర్ మోపెడ్ డ్రైవ్ చేస్తున్నాడు. ఆ మోపెడ్ వెనుక సీటులో ఇంజనీరు హనుమంతరావు కూర్చున్నాడు. మోపెడ్ మీద సాక్షాత్తు వినాయకుడు తొండం లేకుండా కూర్చున్నట్టుంది.

మోపెడ్ దిగిన ఇంజనీరు తన గదిలోకి వెళ్ళాడు. అప్పటికే రామాంజనేయులు ఉన్నాడక్కడ. ఒకరికొకరు నమస్కారం పెట్టుకుని షేక్‌హాండ్స్ ఇచ్చుకున్నారు. "కమీషనర్ ఏంటి మీమీద అంత హీటెక్కిపోతున్నాడు?"

"ఎందుకట" చాలా నింపాదిగా అన్నాడు ఇంజనీరు.

ఎక్కడో నీళ్ళు రాలేదట."

"ఎక్కడట?"

"ఎక్కడో నీళ్ళు రాకపోతే రాకపోవచ్చు. కానీ పదిమందిలో మీ గురించి అతనలా అనక్కూడదు సార్"

"ఏమన్నాడు?"

"ఏదోలేండి. అతను అనగూడనిది- నేను చెప్పకూడనిది, సరేగానీ మావాడి రోడ్డు బిల్లు ఏంచేసారు?

"చేస్తానుగానీ, ముందు నన్ను కమీషనర్ ఏమన్నాడో చెప్పు"

"రామాంజనేయులు ఏదో చెప్పబోగా కమీషనర్ స్కూటర్ కాంపౌండ్‌లోకి వచ్చింది. దాంతో ఇద్దరూ అటువైపు చూసి మాట్లాడటం ఆపేసారు.

ఇంజనీరు వచ్చాడని అటెండర్ చెప్పగానే, అతన్ని పిలవమన్నాడు కమీషనర్.

"రెండు రోజులనుండి ఆఫీసుకు రావట్లేదట. ఏంటండీ ఇది. నేను ఊళ్ళో లేనప్పుడు ఎంత బాధ్యతగా ఉండాలి. ఆ వడ్డేగేరి పక్కన పైపులు లీకేజీ అయిపోయి నీళ్ళన్నీ మురికికాలువలోకి పోతున్నాయి. హరిజనవాడకు రెండురోజుల నుండి నీళ్ళులేవు. బాధ్యత లేకపోతే ఎలాగ?'

"సార్! నేను కూడా ఊళ్ళోలేను."

"ఎక్కడికెళ్ళారు?"

"మా రిటైర్డ్ ఎస్.ఇ.గారొస్తే పుణ్యక్షేత్రాలు చూపించడానికి వెళ్ళాను."

"ఫోన్‌చేసి కనుక్కుంటున్నాను సార్! నీళ్ళు అన్ని వార్డులకు నార్మల్‌గానే వదుల్తున్నట్లు చెప్పారు సార్ మావాళ్ళు."

"మీ వాళ్ళు వదుల్తున్నారండీ! కానీ పోవట్లేదు. పైపులు వేసి రెండు నెలలు కూడా కాలేదు. వడ్డేగేరి పక్కన లీకేజీ. రెండు వందలమంది వచ్చి ధర్నాచేసి పోయారు. మీరు లేనప్పుడు మీ ఫీల్డ్ స్టాఫ్ చూసుకోవాలికదా!"

"చూసుకుంటారు సార్. లీకేజీ వాటర్ కాలువలోకి పోవటంవల్ల కనిపించి ఉండదు."

"సరే జరిగిందేదో జరిగింది. ఇప్పుడు రిపేర్ పెడితే టౌన్ అంతటికి సాయంత్రం సప్లై ఉండదు. అందుకే ఆ చాకలిగేరి, మసీదులైను, రాగిమాను ఏరియాలకు నీళ్ళు బందు చేద్దాం.ఆ ఏరియాలకు టాంకర్లు ఏర్పాటు చేస్తాను. ఉదయాన్నే అయిదుగంటలకు రిపేర్ స్టార్ట్ చేస్తే పది, పదకొండుకి పూర్తయిపోతుంది. ఈవినింగ్ టౌన్ అంతటికీ సప్లై రెస్టోర్ చెయ్యొచ్చు. వెళ్ళండి! అంతా రెడీ చేస్కోండి. ఉదయాన్నే 5 గంటలకి స్టార్ట్ చేస్తే తప్ప, రిపేర్ కంప్లీట్ కాదు. 5 గంటలకే వెళ్ళాలి మీరు."

"అలాగే!" అంటూ కమీషనర్ ఛాంబర్ నుంచి బయటపడ్డాడు ఇంజనీరు. ఫిట్టర్‌ని, టర్న్‌కాక్‌ని, మిగతా ఫీల్డ్ స్టాఫ్‌నంతటినీ పిలిచి రేపు చేయబోయే రిపేర్ గురించి చర్చించాడు. గోడౌన్‌లోంచి తీసుకోవాల్సిన రింగులు, వాచర్‌లు, ఏవి తీసుకోవాలో చెప్పేసి, అందర్నీ పంపించేసి ఒక్క ఫిట్టర్‌ని ఉండమన్నాడు.

అంతవరకూ తన మనసులో నలుగుతున్న ధర్మ సంకటాన్ని బయట పెట్టాడు ఇంజనీరు.

"ప్రోబ్లమ్ ఏమిటంటే- చెన్నప్పా! శేషఫణిగారని రిటైర్డ్ ఎస్.ఇ గారు వచ్చారు. అతను నాకు గురువుగారు. నేను ఎన్.ఎం.ఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఫస్ట అతని దగ్గరే వచ్చేసాను. ఆ తర్వాత అతనే రెగ్యులర్ చేయించారు. నీతో చెప్పటానికి భయమేముంది. ఆదోనిలో పనిచేసినపుడు నా ఉద్యోగం పోయే పరిస్థితి వస్తే- అతనే నన్ను కాపాడినాడు"

"ఆదోని ఇష్యూ ఏంటిసార్?" చెన్నప్ప కుతూహలం ఆపుకోలేక అడిగేసాడు.

"అదింకోసారి చెబుతానుగానీ, ఎస్.ఇ ఫామిలీతో వచ్చాడు. గత రెండు రోజులుగా మహానంది, మంత్రాలయం, అహోబిలం చూపించేసాను. ఒక్క శ్రీశైలం మిగిలిపోయింది. రేపే మో దగ్గరుండి లీకేజీ రిపేరు చేయించమంటున్నారు కమీషనర్. ఏం చెయ్య

డం!"

ఫిట్టర్ చెన్నప్ప దీర్ఘంగా ఆలోచించి అన్నాడు.

"మీరు ఎస్.ఇ.గారితో శ్రీశైలం వెళ్ళిపోండి"

"కమీషనర్ అడిగితే...?"

"మేం తెల్లవారికెళ్ళి బొక్కలు పెట్టేస్తాం. కమీషనర్ వచ్చి మీ గురించి అడిగాడనుకోండి. మన దగ్గర రింగులూ, వాచర్లూ అయిపోయాయి. అవి తేవటానికి డివిజన్ ఆఫీసుకని కర్నూలు పోయినారని చెప్పేస్తాం"

"నేను రాత్రికిగానీ రాలేనే!"

"రాకండి"

"భలే చెప్తావయ్యా! స్పేర్స్ కోసం వెళ్ళానని కమీషనర్‌తో చెప్తానంటున్నావు. నేను రాకుండా రిపేర్ ఎలా పూర్తవుతుంది?"

"అవుతుందని ఎవడన్నాడు? పైపులైను చుట్టూ నాలుగుబొక్కలు పెట్టి మేము కూచుంటాం. కమీషనర్ డివిన్ ఆఫీసుకు ఫోన్ చేస్తాడు. మీరెలాగూ అక్కడ మేనేజ్ చేసేస్తారు. అయిపోయిందా! ఏ అర్ధ

"ప్రోబ్లమ్ ఏమిటంటే- చెన్నప్పా! శేషఫణిగారని రిటైర్డ్ ఎస్.ఇ గారు వచ్చారు. అతను నాకు గురువుగారు. నేను ఎన్.ఎం.ఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఫస్టు అతని దగ్గరే పన్చేసాను. ఆ తర్వాత అతనే రెగ్యులర్ చేయించారు. నీతో చెప్పటానికి భయమేముంది. ఆదోనిలో పనిచేసినపుడు నా ఉద్యోగం పోయే పరిస్థితి వస్తే- అతనే నన్ను కాపాడినాడు"

రాత్రికయినా మీరొస్తారుకదా!"

"ఓ తప్పకుండా!"

"మరింకేమి! స్పేర్స్ మీరే తెచ్చినట్టు చూపిస్తాం. ఎల్లుండి రిపేరు చేయిస్తాం."

చెన్నప్ప తెలివి చూసి ఇంజనీరుకి పట్టలేనంత ఆనందంగా ఉంది. జేబులో చెయ్యిపెట్టి అది పట్టినన్ని నోట్లు తీసి ఫిట్టర్ చేతిలో కుక్కాడు.

** ** **

మర్నాడు 5 గంటలకు పైపులైను తవ్వడం ప్రారంభించారు. రాత్రి ఇంజనీరు,ఫిట్టర్ వేసిన ప్లాన్ మిగతావాళ్ళకు తెలీదు. అందువలన స్పేర్స్ అన్నీ స్పాట్‌లోకి తెచ్చేసారు.

కమీషనర్ స్కూటర్ మీద స్పాట్ దగ్గరకు వస్తున్నాడు. అంతదూరం నుండే కమీషనర్‌ని చూసాడు ఫిట్టర్.

ఎదురుగా స్పేర్ సామానుంది. కమీషనర్ వచ్చేస్తున్నాడు. ఫిట్టర్‌కి ప్రాణం పోయినంత పనయింది. చుట్టూ చూసాడు. స్పేర్ పార్ట్స్ ఎక్కడ దాచాలో అర్థంకాలేదు. కమీషనర్ స్కూటర్ ఇంకా దగ్గరవుతోంది. గభాల్న సామానంతా పక్కనున్న డ్రైనేజీల పడేసాడు.

** ** **

రాత్రి వేసిన ప్లాను ప్రకారమే అంతా చెప్పాడు ఫిట్టర్. అది విని స్పేర్స్ తేవడానికి స్వయంగా వెళ్ళిన ఇంజనీరుని అభినందించకుండా ఉండలేకపోయాడు కమీషనర్.

కానీ, అతనికి తెలీదు. ఆరోజు కూడా నీళ్ళు రావని. సాయంత్రం ధర్నా కోసం మహిళల్ని రామాంజనేయులు ప్రేరేపిస్తున్నాడని.

✢

# రాయిస్టు ఆలోచనలకు పాదు వేసిన ఎం.వి.శాస్త్రి

**తెలుగునాట పత్రికారంగానికి చెందిన ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఇతర రంగాలతో సంబంధం ఉన్నా పత్రికా రంగానికి సేవలు అందించిన అరుదయిన పాత్రికేయులు కూడా ఉన్నారు. పాత్రికేయులుగా ఉంటూనే విభిన్న రంగాల్లో రాణించినవారు కూడా ఉన్నారు. వారి గురించి ఈ తరానికి పరిచయం చేసే ప్రయత్నమిది. అందులో భాగంగా అందిస్తున్న తొలి వ్యాసమిది.**

జర్నలిస్ట్‌గా ఆరంభించి, తలవని తలంపుగా ఆంధ్రలో పునర్వికాసోద్యమానికి నాంది పలికిన ములుకుట్ల వెంకటశాస్త్రి (ఎం.వి.శాస్త్రి) పాత్ర గమనార్హం.

కుందూరి ఈశ్వరదత్తు స్వాతంత్ర్యోద్యమ రోజులలో పీపుల్స్‌వాయిస్ అనే పేరిట మద్రాసు నుండి ఇంగ్లీషు పత్రిక నడిపారు. 1936లో ఫైజ్‌పూర్ (మహారాష్ట్రలో ఒక గ్రామం) కాంగ్రెసు పార్టీ మహాసభ డిసెంబరులో జరిగింది. ఆ సభా విశేషాలు రాసే నిమిత్తం ఎం.వి.శాస్త్రిని పీపుల్స్ వాయిస్ పక్షాన పంపారు. కాకినాడలో చదువు ముగించిన ఎం.వి.శాస్త్రి ఉత్సాహంగా వెళ్ళారు. అక్కడ జైలు నుండి విడుదలై వచ్చి, రాజకీయాలలో హేతుబద్ధంగా, అంతర్జాతీయ వ్యవహారాలు అవలీలగా మాట్లాడిన ఎం.ఎన్. రాయ్ మాటలు ఎం.వి.శాస్త్రిని ఆకట్టుకున్నాయి. గాంధీ మత, మిత ధోరణిని వ్యతిరేకిస్తూ మాట్లాడిన రాయ్‌ను ఆంధ్రకు ఆహ్వానించి వచ్చారు శాస్త్రి.

## అరుదైన మనీషి



ములుకుట్ల వెంకటశాస్త్రి

1937 జూలై చివరలో మద్రాసులో యువజనసభలో పాల్గొన్న ఎం.ఎన్.రాయ్ ఆగస్టు 1న తొలిసారి ఆంధ్రలో అడుగుపెట్టారు. నెల్లూరులో వెన్నెల కంటి రాఘవయ్య ఆధ్వర్యాన జరిగిన వ్యవసాయ కార్మికుల మహాసభకు ఎం.ఎన్.రాయ్ ప్రధాన వక్తగా వచ్చారు. అక్కడ జబ్బుపడ్డారు. కాకినాడ నుండి ఎం.వి.శాస్త్రి వెంటనే వచ్చి ఎం.ఎన్.రాయ్‌ను తమ వూరికి తీసుకెళ్ళారు. అక్కడ శాస్త్రిగారి వద్ద రాయ్ కోలుకుంటున్నప్పుడే, విశాఖపట్టణం నుండి అబ్బూరి రామకృష్ణారావు (యూనివర్శిటీలో లైబ్రేరియన్, థియేటర్ నిపుణులు) వచ్చారు. ఆవిధంగా ఎం.ఎన్.రాయ్‌ను వారిరువురూ ఆంధ్రకు పరిచయం చేశారు. వారి జీవితాల్లో అదొక పెద్ద మలుపు అయింది. ఎం.వి.శాస్త్రి అప్పటి నుండీ రాయ్ అనుచరుడుగా పనిచేశారు. రాడికల్ డెమొక్రటిక్ పార్టీలో ప్రధానపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర రాడికల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభల్ని కాకినాడలో నిర్వహించారు. బెంగాల్ నుండి కె.కె.సిన్హా ప్రారంభోపన్యాసకులుగా వచ్చారు.

ఆంధ్రలో ఎప్పుడు పర్యటనకు వచ్చినా శాస్త్రి దగ్గరకు వచ్చేవారు రాయ్ దంపతులు. రాడికల్ హ్యూమనిస్ట్ పత్రికలో శాస్త్రి అనేక వ్యాసాలు రాశారు. ఇంగ్లీషులో వ్యాసాలు రాయడంలో శాస్త్రిగారు దిట్ట. చాలా హేతుబద్ధంగా, మంచి శైలిలో, హాస్యం తొణికిస్తూ రాసేవారు. రాయ్ 1954లో చనిపోయిన అనంతరం, అడ్వొకేట్‌గా ప్రాక్టీసు చేసిన శాస్త్రిగారు రాజగోపాలాచారి వాదనల పట్ల, ఉదారవాద, స్వేచ్ఛాభావాల పట్ల ఆకర్షితులయ్యారు.

1959లో రాజాజీ స్వతంత్ర పార్టీ స్థాపకులుగా ఆంధ్ర పర్యటించినప్పుడు కాకినాడలో శాస్త్రిగారింట్లో జరిగిన విందులో నేను పాల్గొన్నాను. ఆనాడు గొప్ప సభ జరిగింది. రాజాజీ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించడానికి ప్రయత్నించిన ఉషశ్రీ విఫలమయ్యారు. చివరకు శాస్త్రిగారి సలహాపై గౌతులచ్చన్న అనువదించి, మెప్పించారు. శాస్త్రి స్వరాజ్య పత్రికలో అనేక వ్యాసాలు రాశారు. కె.సంతానం సంపాదకుడుగా మద్రాసు నుండి నడిచిన ఆ పత్రిక మేధావులను ఆకర్షించింది. ముఖ్యంగా హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని అడ్డు కున్నది.

ఎం.వి.శాస్త్రి ఆంధ్రలోని రాడికల్ హ్యూమనిస్టులలో ఆవుల గోపాలకృష్ణమూర్తికి సన్నిహితులుగా వుండేవారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికలలో గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.వి.శాస్త్రి నిలిచారు. ములుకుట్ల వెంకటశాస్త్రికి ఓటు వేయమంటూ ఆయన ఒక ఆకర్షణీయ విజ్ఞప్తి ఓటర్లకు పంపారు. శాస్త్రిగారు నెగ్గి, ఎం.ఎల్.సి.గా ఒక టరమ్ పనిచేశారు.

శాసనమండలిలో పరిమితంగా మాట్లాడినా, చాలా లోతైన భావోపన్యాసాలు చేశారు. హుందాగా ప్రవర్తించారు. 1962 నుండి ఆయన ఎం.ఎల్.సి.గా హైదరాబాద్‌లో వుంటూ వచ్చారు. అప్పుడే స్వతంత్ర పార్టీ సమావేశాల్లోనూ పాల్గొన్నారు.

రాజగోపాలాచారి ముఖ్యంగా ఎం.వి.శాస్త్రి తీర్మానపాఠాల్ని మెచ్చుకునేవారు. శాస్త్రిగారు రాస్తే రాజాజీ యథాతథంగా అక్షరం మార్చకుండా ఆమోదించేవారు. ఆయన ఇంగ్లీషు అంత బాగా వుండేది. శాస్త్రిగారికి అందరూ అమ్మాయిల సంతానమే. పెళ్ళిళ్ళ రీత్యా వారిలో కొందరు అమెరికా వెళ్ళారు. శాస్త్రిగారు అనేక పర్యాయాలు అమెరికా పర్యటించారు. హైదరాబాద్‌లో వుండగా దంటు భాస్కరరావుతో కలిసి శాస్త్రిగారు వినోద, సాహిత్య కార్యకలాపాలు ఆనందించేవారు. శాస్త్రిగారి వ్యాసాలు, శాసనమండలి ఉపన్యాసాలు గ్రంథస్థం కావలసివుంది. 1990లో శాస్త్రిగారు మరణించారు.

**- ఎన్.ఇన్నయ్య**